క్లుప్తంగా

రూ.3.50లక్షల ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన కంది సుమన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు కలిసి రూ.3.50లక్షల సేకరించారు. మృతుడి కుమార్తెలు నైతిక ప్రహస్తిని, చతుర్వేని పేరు మీద రూ.1.75లక్షల చొప్పున రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను బాధిత కుటుంబానికి అందజేశారు.

శ్రీనివాస్‌రెడ్డికి సాహిత్య పురస్కారం



మహబూబాబాద్: ఏలూర్‌లో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీలలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన కవి రచయిత సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని సిందూరం అనే కవితా గానం చేసినందుకు సాహిత్య పురస్కారం అందజేశారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



గూడూరు: జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న 1.34 గుంటల ప్రభుత్వ భూమిని అక్రమించుకున్న ఓంనారాయణ లోయపై చర్యలు తీసుకొని, ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ కోరారు. గూడూరు మండలం మచ్చర్ల శివారులోని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ స్వగృహంలో ఆదివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాందాస్, శంకర్‌నాయక్, భీముడునాయక్, మోహన్, అనిల్‌నాయక్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సింహాపురంలో 25 కేవీ రెండు సింగిల్ ఫేస్ నూతన ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్‌శాఖ సీఈ రాజ్‌చౌహాన్, ఎస్‌ఈ నరేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో గ్రామంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ్, ఏఈ సుమన్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్చిలో మదర్స్ డే వేడుకలు



మహబూబాబాద్ రూరల్: తల్లి రుణం తీర్చుకోలేమని బ్లెస్డ్ చర్చి రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఏ.ప్రేమానందం అన్నారు. మదర్స్ డే వేడుకలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లెస్డ్ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్టెల్లా మేరీ గ్రేస్ అమ్మగారిని చర్చి సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

జయప్రదం చేయండి


నెహ్రూసెంటర్: మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పూనెం ప్రభాకర్, పైండ్ల యాకయ్య, చిదరబోయిన పాపయ్య, బూర్గుల మోష, కోడారి రాంచంద్రు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో 9వ మున్నూరుకాపు సంఘం నూతనంగా ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా తోట యాదగిరి, ఉపాధ్యక్షుడిగా గూడురు రాజు, ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి బాబురావు, కోశాధికారి కొమ్మినేని రాము, ప్రచార కార్యదర్శి తోట శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా గూడురు నాగేశ్వర్‌రావు, పొన్నం వెంకన్న, కార్యవర్గసభ్యులు సింగంశెట్టి సురేష్, గూడురు శ్రీను, తోట సందీప్ ఎన్నికయ్యారు.

చెరువు శిఖం భూమి కబ్జా..!

- వెలికి తీయాలని కోరుతున్న రైతులు
- సర్వేచేసి చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని విన్నవం



పెద్దచెరువు శిఖం భూమి

గార్ల: గార్ల పెద్దచెరువులో కబ్జాకు గురైన చెరువు శిఖం భూమిని రెవెన్యూ అధికారులు హైడ్రా ద్వారా ఉపయోగించి వెంటనే వెలికి తీయాలని చెరువు ఆయకట్టు రైతులు సంబంధిత జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నారు. గార్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 76లో గల 396.11ఎకరాల విస్తీర్ణంలో కాకతీయుల కాలంలో గార్ల పెద్దచెరువు నిర్మితమై ఉంది. చెరువు కింద 2000 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఇట్టి చెరువు శిఖం భూమిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో, చెరువు చుట్టు పక్కల రైతులు దర్జాగా సుమారు 150ఎకరాల భూమిని కబ్జా చేసుకొని ప్రతీ ఏటా వరిపంట సాగు చేసుకుంటున్నారు. కొందరు కబ్జాదారులు అయితే ఏకంగా చెరువు శిఖం భూమిలో బావులు తీసి 300మీటర్ల మేర ఉన్న మిరప తోటల రైతులకు నీళ్లను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుండడంతో చెరువులో నీటి నిల్వ తగ్గిపోయి ప్రతీఏటా ఖరీఫ్‌లో చెరువు ఆయకట్టు కింది చివరి రైతుల భూముల్లో పంట చేతికందే దశలో ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరువు చుట్టుపక్కల రైతులు వేసవికాలంలో రాత్రి సమయాల్లో జేసీబీల ద్వారా మట్టి ఎత్తుపోసుకుంటూ మడులు కట్టుకుంటూ శిఖం భూమిని కబ్జా చేసుకుంటున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకుంటే చెరువు శిఖం భూమిని సగం మేర కబ్జాకు పాల్పడే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించి కబ్జాకోరల్లో ఉన్న శిఖం భూమిని స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

శిఖం భూమిని వెలికితీయాలి



కబ్జాకు గురైన గార్ల పెద్దచెరువు శిఖం భూమిని వెలికి తీసేందుకు రెవెన్యూ అధికారులు హైడ్రా చట్టం ఉపయోగించి సర్వే చేసి శిఖం భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలి. లేకపోతే ప్రతీఏటా ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందక పంట చేతికందే దశలో ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– మహేశ్వరరావు, రైతు, గార్ల

అరుణశ్రీ ఆశయ బాటలో పయనిద్దాం



మాట్లాడుతున్న గోవర్ధన్

నెహ్రూసెంటర్: నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు విప్లవోద్యమ కార్యకర్తగా, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడిన అరుణశ్రీ ఆశయాల బాటలో పయనించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్ధన్, పీఓడబ్ల్యూ జాతీయ సమన్వయకర్త ఝాన్సీ అన్నారు. అరుణశ్రీ సంతాప సభ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, గుమ్మడి నర్సయ్య, బండి పుల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మండల వెంకన్న, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, చంద్ర అరుణ, రాయల విమల, ఆకుల పాపయ్య, మార్నేని వెంకన్న, కిషన్‌నాయక్, చుంచు శ్రీశైలం, సామ మల్లారెడ్డి, బండా ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందరివాడు బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గూడూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, కానీ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన వాడు కాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో శనివారం ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ వెడల్పులో పక్కకు పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఆవిష్కరించేందుకు చేపట్టిన కమిటీ ప్రతినిధులు, మండల, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం, ఆహ్వానించకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటో అర్థం కాలేదన్నారు. విగ్రహ ఆవిష్కరణ కమిటీలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన వారు ఉంటే, కార్యక్రమం ఆ పార్టీలకు చెందినది అవుతుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నూకల సురేందర్‌యాదవ్, వాంకుడోతు కతార్‌సింగ్, రామన్ననాయక్, సురేష్‌నాయక్, రహీంపాష, బోడ ఎల్లయ్య, వీరన్న, రాంచందర్ పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల తరలింపులో జాప్యం

- కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వడ్లు
- కన్నీటి పర్యంతమైన బాధిత కౌలు రైతులు



మొలకెత్తిన కాంటా పెట్టిన ధాన్యం బస్తాలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని తరలించడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. నెల రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నారు. పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు గండి వీరభద్రం నెల రోజుల క్రితం గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తీసుకొచ్చి ఆరబెట్టాడు. సదరు రైతు కాంటా పెట్టిన ధాన్యం బస్తాలు మాత్రం అక్కడే ఉంచారు. అదేమిటని రైతు ప్రశ్నిస్తే ట్రాక్టర్లు పెట్టుకొని తరలించుకో అని నిర్వాహకులు నిర్లక్ష్య సమాధానం చెప్పుతున్నారే తప్పా తన ధాన్యాన్ని మాత్రం అక్కడ ఉంచారని బాధిత రైతులు వాపోయాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అన్ని ధాన్యం బస్తాలు మొలకెత్తాయని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. అదేవిధంగా మరో రైతు శ్రీనివాసచారికి చెందిన 70 బస్తాలు కూడా కాంటా పెట్టి కొనుగోలు కేంద్రంలోనే మగ్గుతున్నాయి.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: ఇటీవల మండల కేంద్రంలో పరస్పరం బైక్‌లు ఢీకొని మృతి చెందిన ముగ్గురు యువకుల తల్లుల కడుపు కోతను తీర్చడం ఎవరితరం కాదని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ కన్నీటి పర్యాంతమైయ్యారు. మరిపెడ మండలం బావోజిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భోజ్యతండా, వాగుఒడ్డుతండ, వెంకురాంతండాలను చెందిన గుగులోతు కార్తీక్ (22), భూక్య సంతోష్ (19), లజ్మీర సుధీర్ (18) ముగ్గురు యువకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బాధిత కుటుంబాలను పరామర్శించాడు. ఆర్థిక సాయాన్ని అందజేశాడు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువీరరెడ్డి, నాయకులు కాలం రవీందర్‌రెడ్డి, దిగజర్ల జగదీష్, గుగులోతు రాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నాల్గోరోజు హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. దేవాలయం నుంచి హనుమాన్ విగ్రహంతో మేళతాళాల నడుమ బయలుదేరిన మండల హనుమాన్ మాలాధరులు, గురుస్వామి మేరుగు మల్లయ్యగౌడ్, బల్సుకూరి సంపత్, మడిపెద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. వేణుగోపాలాచార్యులు, జగదీశ్వర్‌శాస్త్రి, శంకర్‌గౌడ్, రవిసింగ్‌రాథోడ్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

గార్ల: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.2లక్షల విలువ గల బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని కొలిమికొట్టం బజారుకు చెందిన బాదావత్ కేస్లీ నెల రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి గార్లకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా లో దాచుకున్న 3 తులాల చంద్రహారం, 2ఉంగరాలు, చెవిదిద్దులు, 10తులాల వెండి పట్టీలు మాయమయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సందర్శించారు. బాధితురాలు కేస్లీ ఫిర్యాదు మేరకు ట్రెయినీ ఎస్సై ఎస్‌డీ మైబూబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారుపై దాడి.. ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అకారణంగా కారుపై దాడి చేసి ఇబ్బందికి గురిచేసిన ఘటనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపిక ఆదివారం తెలిపారు. కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి రాహుల్ రెడ్డి మానుకోట మండలంలోని అమనగల్ గ్రామానికి శనివారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి 11 గంటల సమయంలో రాహుల్ రెడ్డి తన కారులో మహబూబాబాద్ వైపునకు వస్తుండగా బలరాం తండా గ్రామ ప్రధాన రహదారిపై పెళ్లి ఊరేగింపు నడుస్తుంది. ఈ క్రమంలో కారు డ్రైవర్ దాసరి శ్రీకాంత్ తమకు దారి ఇవ్వాలని హారన్ కొడుతుండగా పలువురు వ్యక్తులు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలోనే ఇస్లావత్ హరి అనే వ్యక్తి కారుపై దాడి చేశాడు. బాధితుడు రాహుల్ రెడ్డి జరిగిన సంఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గార్ల: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలావున్నాయి. గార్ల మండలం పూసలతండాకు చెందిన బి. హరి(55) గత నెల 30 నుంచి గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి ప్రతీరోజు వచ్చి వైద్యం చేయించుకుని ఇంటికి వెళ్తుంటాడు. రోజూ మాదిరిగానే ఆసుపత్రికి రావడంతో, స్థానిక వైద్యుడు హనుమంతరావు చికిత్స చేస్తుండగా హరి మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు సంతానం.

మాజీ మంత్రి పరామర్శ

తొర్రూరు రూరల్: తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన గీతా కార్మికుడు పల్లె యాకన్న కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు పరామర్శించి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు పసుమర్తి సీతారాములు, తూర్పాటి అంజయ్య, మంగళపెల్లి శ్రీనివాస్, ఎస్‌కే అంకూస్, శ్రీపాల్‌రెడ్డి, సర్వయ్య, మల్లేశం, యర్రం రాజు పాల్గొన్నారు.

వాకింగ్‌తోనే ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: నేచర్ క్యూర్ వాకింగ్‌తోనే ఆరోగ్యంగా ఉంటారని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నేచర్ క్యూర్ డాక్టర్ జేవీఎస్ చారి ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యులకు ఉచిత వైద్యం అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు నిమిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, సభ్యులు దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన అడవి పంది

ముగ్గురికి గాయాలు



గాయపడిన జాటోతు లక్ష్మి

కొత్తగూడ: అడవి పంది ఆటోను ఢీకొట్టిన సంఘటన మండల కేంద్ర సమీపంలోని గువ్వల బోడు వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓటాయి నుంచి నర్సంపేటకు ద్విచక్రవాహనం వెనక ఆటోలు వెళ్తున్నాయి. పక్కన చెట్ల పొదల్లో ఉన్న అడవి పంది హఠాత్తుగా బయటకు వచ్చి ముందుగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో రెండు వాహనాలు పడిపోయాయి. ఈఘటనలో జాటోతు లక్ష్మికి చేయి రెండు చోట్ల విరగగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. అడవి పంది సంఘటన స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది పంచనామా చేసి పందిని ఖననం చేశారు.

పింఛన్‌లో రూ.16 కోత

- పోస్ట్‌మాస్టర్ ఇవ్వడం లేదని లబ్ధిదారుల ఆందోళన



మల్యాల గ్రామంలో ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరాగా ఉండాలని ఇస్తున్న పింఛన్లలో కోతలతో ఆసరా లబ్దిదారులు మనోవేదనకు గురవుతున్నారు. మహబూబాబాద్ మండలంలోని ఉమ్మడి మల్యాల జీపీ పరిధిలో ప్రతినెలా ఇదే తతంగం కొనసాగుతుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసరా లబ్దిదారులకు పింఛన్లు ఇచ్చే పోస్ట్‌మాస్టర్ రూ.2,016, రూ.3,016ల్లో రూ.16 ఇవ్వకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాడన్నారు. దీంతో ఉమ్మడి మల్యాల జీపీ పరిధిలోగల రేగడి తండా, మల్యాల, దామ్య తండా, చోక్లతండా, సాదుతండా జీపీల పరిధిలో ప్రతినెల రూ.16చొప్పున నష్టపోతున్నామని అబ్ధిదారులు వేపోతున్నారు. పోస్ట్‌మాస్టర్‌ను రూ.16 విషయంపై అడిగితే ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి ఆసరా లబ్దిదారులకు న్యాయం చేయాలని వారు కోరారు.

రూ.16 ఇవ్వడం లేదు



పోస్ట్‌మాస్టర్ ప్రతినెల పింఛన్లు ఇచ్చేటప్పుడు రూ.16 ఇవ్వడం లేదు. అలా ఎందుకు చేస్తున్నావని అడిగితే పట్టించుకోకుండా వ్యవహరిస్తుంది. రూ.16 ఇవ్వమంటే లేవు, తరువాత చూద్దాం అని అదరగొడుతుంది. మేము చిల్లర డబ్బులు తీసుకువచ్చినప్పటికీ కోత పెడుతుంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కుంచపు ఎల్లమ్మ, మల్యాల

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కురవి: సీరోలులోని కాంపల్లిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మహబూబాబాద్ అర్బన్: జమాండ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..



డోర్నకల్: జెడ్పీహెచ్ఎస్‌లో..

డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యను బోధించిన నాటి గురువులు సీతారాంబాబు, లక్ష్మణాచారి, శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేష్ వీరభద్రం, దామోదరాచారి, రమాబాయి పాల్గొన్నారు.

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 2001–02 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, రవి, వీరన్న, సిద్దయ్య, నరేష్, గోవర్ధన్, ఆనందరావు, వెంకన్న, ఇస్లావత్ నరేష్, తగరం సాంబయ్య, భవాని, సుమలత, అరుణ, పద్మశ్రీ, స్రవంతి పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2006– 07 పదో తరగతికి చెందిన బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు సంకా బద్రీనారాయణ, తేజోన్నత రెడ్డి, సామి, దామోదర్, విష్ణువర్ధన్, సరస్వతి, విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంబాల శివకుమార్, విజయ్, సూరబోయిన సుధాకర్, కర్పూరపు అనిల్, రహీం, సుధాకర్, ఖాజాసపాషా, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కొత్తగూడ: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తగూడ: అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. మండలంలోని పొగుళ్లపల్లి, సాదిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. ఎండిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 31వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. అప్పటి వరకు అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా కాపాడుకోవాలని పలు సూచనలు చేశారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

కేసముద్రం: మండలంలోని అన్నారం, తాళ్లపూసపల్లి, కల్వల, కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు, మహమూద్‌పట్నం, ధన్నసరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ ఎర్రయ్య సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కాంటాలు పెట్టి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత ఉండడంతో ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించాలన్నారు. ఈ మేరకు ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లులకు రవాణా చేశారు.

కాంటాలు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రం సందర్శిస్తున్న నాయకులు

చిన్నగూడూరు: కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శులు ఉడుగుల లింగన్న, ఇరుగు నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం భారీగా వస్తుండడంతో కాంటాలు నిధానంగా కొనసాగుతున్నాయన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యానికి 50శాతం మంది రైతులకు ఇప్పటి వరకు రూ.500 బోనస్ జమ కాలేదన్నారు. యాసంగి సీజన్‌కైనా రైతులందరికి బోనస్ పడే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎడ్ల మల్లయ్య, మాజీ సర్పంచ్ బీసు మంజుల, డీఎస్ వెంకన్న, బీసు మల్లేషం, ముత్యం అంబరీష, రైతులు పాల్గొన్నారు.